

టాస్క్ పేరిట టోకరా

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి నగర పోలీసు కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ప్రజలకు సూచించారు. 8లో



మబ్బుల్లో నగరం

సూర్యుడు అస్తమించిన వేళ నగరంలో మబ్బులు దట్టంగా కమ్ముకున్నాయి. ఆకాశం మేఘావృతమై వానజల్లు కురిశాయి.

లయన్స్‌ను వేటాడిన టైటాన్స్



ఏపీఎల్ సీజన్–2 ఎలిమినేటర్ మ్యాచ్‌లో లయన్స్‌ను టైటాన్స్ వేటాడేశాయి. హెడ్‌ఆన్స్‌లో విజయంతో ఎలిమినేటర్ మ్యాచ్‌కు అర్హత సాధించిన గోదావరి టైటాన్స్ రెచ్చిపోయింది. ఉత్తరాంధ్ర లయన్స్‌పై విజయం సాధించింది. 8లో

న్యూస్‌రీల్

విశాఖ తూర్పు సమన్వయకర్తగా ఎంవీవీ



సాక్షి, విశాఖపట్నం: విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు : విశాఖ తూర్పు నియోజవర్గ సమన్వయకర్తగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెడతానని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. పార్టీ గెలుపు కోసం కృషిచేస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన కేంద్ర బృందం



తర్లువాడ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల వద్ద కేంద్ర బృందం

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను శుక్రవారం కేంద్ర బృందం సందర్శించింది. ఈ బృందంలో నాబార్డ్ అధికారులు, నేపాల్ వ్యవసాయశాఖ ప్రతినిధులతో పాటు 17 రాష్ట్రాలకు చెందిన అధికారులు ఉన్నారు. రైతు సాధికార సంస్థ అధికారి ప్రకాష్ ఆధ్వర్యంలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర కమ్యూనిటీ నేచురల్ ప్రాజెక్ట్ మేనేజర్ మోహనరావు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీలో పార్లమెంటరీ కమిటీ



ఎన్టీపీసీ సింహాద్రి హిందీ పత్రిక సువాసికను ఆవిష్కరిస్తున్న కేంద్ర బృందం

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీలో అమలు జరుగుతున్న రాజభాష కార్యకలాపాలను పార్లమెంట్ కమిటీ రెండో ఉప సంఘం శుక్రవారం పరిశీలించింది. పార్లమెంటు కమిటీ ఉప సంఘ కన్వీనర్ రంజన్ బెన్ భట్ అధికార భాషా విధానానికి అనుగుణంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. అధికార భాష హిందీని ఉపయోగించడం కోసం సింహాద్రి ఎన్టీపీసీ చేస్తున్న కృషిని ప్రశంసించారు. పార్లమెంటు సభ్యురాలు మాల రాజ్యలక్ష్మీ షా, సంగీతా అధికార భాషా లక్ష్యాల పురోగతిపై చర్చించారు. సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, విద్యుత్ మంత్రిత్వశాఖ ఎకనామిక్ అడ్వైజర్ జితేష్ జాన్ మాట్లాడారు. అనంతరం ఎన్టీపీసీ సింహాద్రి హిందీ పత్రిక 'సువాసిక'ను పార్లమెంటరీ కమిటీ బృందం ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో మానవ వనరుల చీఫ్ జనరల్ మేనేజర్ సి.కుమార్ పాల్గొన్నారు.

పునరుత్పాదక ఇంధనంతో స్థిరమైన వృద్ధి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ఎంవీపీకాలనీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీలో శుక్రవారం వర్కుషాపు ప్రారంభమయ్యింది. పునరుత్పాదక ఇంధనం ద్వారా స్థిరమైన వృద్ధి అనే అంశంపై ఏయూలోని ఐఐపీఈ కేంద్రంలోని మెకానికల్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఈ వర్కుషాపు నిర్వహించారు. పునరుత్పాదక ఇంధన రంగ నిపుణుడు ఆచార్య శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఐపీఈ డైరెక్టర్ ఆచార్య శాలివాహన్ పాల్గొన్నారు.

మంగళకారిణి.. సౌభాగ్యప్రదాయిని





స్వర్ణాభరణ అలంకరణలో సిరులతల్లి



నవద్రవ్యాల పూజలో పాల్గొన్న మహిళలు (ఇన్‌సెట్) సువర్ణ వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి

- నగరంలో శ్రావణ శోభ
- కిటకిటలాడిన ఆలయాలు

దాబాగార్డెన్స్: సకల సౌభాగ్యాలు ప్రసాదించే శ్రావణలక్ష్మి నామస్మరణతో నగరం మార్మోగింది. శ్రావణమాసపు పవిత్ర శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఇళ్లల్లో అమ్మవారిని పూజించారు. బంగారు కాసులతో కొలిచారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

శ్రావణ శుక్రవారం..వరలక్ష్మీ వ్రత పుణ్యతిథి నాడు కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణాలంకరణలో ధగధగ మెరిసియారు. ఈ సందర్భంగా పలువురు ఉభయదాతలతో శ్రావణలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు వరలక్ష్మీ వ్రతాలు, ప్రత్యేక కార్యక్రమాలతో నగరంలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక శోభ వెల్లివెరిసింది. నగరంలోని బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి, వేద మంత్రాలు, నాదస్వర వాయిద్యాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. పూజలో పలువురు ఉభయదాతలు నేరుగా పాల్గొన్నారు. పోస్టు ద్వారా వివరాలు పంపి డబ్బు చెల్లించిన పలువురి పేరిట అర్చన చేసి, వారికి కుంకుమ, ప్రసాదం పంపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు స్వర్ణాభరణాలతో అలంకరించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శ్రావణ మాసంలోజరిగే పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2711725, 2568645 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు.



హోమంలో పాల్గొన్న భక్తులు,ఈవో శిరీష

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

నగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారు సువర్ణ వస్త్రాలంకరణలో విశేషంగా ఆకట్టుకున్నారు. అమ్మవారి మూలవిరాట్‌కు వేకువజాము 5 గంటలకు శుద్ధజలం, పాలు, పెరుగు, తేనే, గంధం, పసుపు, కుంకుమ వంటి 108 ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో ప్రత్యేక క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం ప్రత్యేక పూజలు, 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేకంగా నివేదించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. 350 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు జరిపారు. కార్యక్రమంలో దేవాలయ సంఘ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, పురోహితుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ, కన్యకాపరమేశ్వరి దేవస్థానం శ్రావణమాస ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ వేదా కవిత, కొత్తా సాహిత్య, ప్రసన్న, సత్యవతి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి క్షీరాభిషేక సేవ..

శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేక సేవ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించారు. ఈ పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింహగిరిలో వైభవంగా..

సింహచలం : సింహగిరికి శ్రావణ శోభ నెలకుంది. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 9గంటల నుంచి అర్చకులు పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింహవల్లీ తాయారు అమ్మవారి ప్రతినిధులుగా సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను సింహాసనంపై అధిష్టింపజేశారు. పదిమంది అర్చకులు లక్ష నామాలను పఠిస్తూ కుంకుమపూజను నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలు, కుంకుమ, ప్రసాదం అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, కుమారాచార్యులు, పారాయణదారులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటిండెంట్ సుసీల్ ఏర్పాట్లు చేశారు.

విశేషంగా సహస్రనామార్చన

శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సాయంత్రం సింహవల్లీ తాయారు సన్నిధిలో సహస్రనామార్చాన విశేషంగా నిర్వహించారు. 1001 నామాలను పఠిస్తూ భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో వేంజింపజేసి, ఆలయ మాడ వీధిలో విశేషంగా తిరువీధి నిర్వహించారు.



సింహవల్లీ తాయారు అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న వైదికులు

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మేయర్ హరివెంకట కుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



సీఎం జగన్‌తో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



సీఎం జగన్‌కు బొకే అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ మండలం చిన్నమేడపల్లిలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ శంకుస్థాపనకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం 10.10 గంటలకు సీఎం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలికారు.

ఆత్మీయ పలకరింపు

మన్యం జిల్లా పర్యటన ముగించుకుని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్లో తిరిగి మధ్యాహ్నం 1.45 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకున్నారు. ప్రజాప్రతినిధులను ఆత్మీయంగా పలకరించారు. వీఐపీ లాంజ్‌లో దాదాపు గంటపాటు రిజర్వ్‌లో ఉన్నారు. డిప్యూటీ సీఎం, మంత్రులను, మేయర్, ఎంపీలను, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, సమన్వయకర్తలను ఒక్కొక్కరినీ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు పరిచయం చేశారు.

ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు..


అనంతరం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, కన్నబాబురాజు, వాసుపల్లి గణేష్ కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, సమన్వయకర్త కె.కె.రాజు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు.

ఉద్యోగ కల్పనే లక్ష్యం : డీఆర్‌డీఏ పీడీ

సాక్షి, విశాఖపట్నం: ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీల కుటుంబాల్లో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన పిల్లలకు 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్ శోభారాణీ, డ్వామా పీడీ ఇ. సందీప్ అన్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల సీడాప్ అధికారులు, శిక్షణ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్ శోభారాణీ, డ్వామా పీడీ సందీప్ మాట్లాడుతూ..2018 నుంచి 2024 ఆర్థిక సంవత్సరాల మధ్య 100 రోజులు పూర్తి చేసుకున్న..అర్హత కల్గిన ప్రతీ ఒక్కరికీ శిక్షణ కల్పించేలా అధికారులంతా అవగాహన కల్పించాలని ఆదేశించారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో క్లస్టర్ల వారీగా శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండాడలో చిరుత కలకలం?

కొమ్మాది : ఎండాడ కొండవాలు ప్రాంతంలో చిరుతపులి సంచరించినట్లు చెలరేగిన వార్తలు కలకలం రేపాయి. వివరాలివీ.. ఎండాడ గుజరాత్ భవన్(కల్యాణ మండపం) వద్ద సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న గణేష్ శుక్రవారం ఉదయం టిఫిన్ చేసేందుకు బయటకు వచ్చాడు. ఆ ప్రాంతానికి సమీపంలోని కొండ వద్ద చిరుత పులిని చూసినట్లు తెలిపారు. భయంతో పరుగున వచ్చి స్థానికులకు ఈ విషయం తెలిపాడు. ఇది తెలుసుకున్న స్థానికులు అక్కడకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. స్థానిక యువకులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా.. ఫారెస్ట్ ప్రాజెక్టు శాస్త్రవేత్త ఆడారి యజ్ఞపతి సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. కొండ ప్రాంతాలను పరిశీలించారు. అయితే అక్కడ చిరుత పులి జాడలేవి లేవని, ఆ ప్రాంతంలో ఓ జీవి అడుగులు కూడా చిరుతపులి అడుగులు కాదని నిర్ధారించారు. అయితే సెక్యూరిటీ గార్డ్ గణేష్ కచ్చితంగా చిరుత పులిని చూశానని చెబుతున్న నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరిశీలిస్తామన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

దొండపర్తి: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పూర్తి శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్టు పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ తెల్పిచెప్పారు. ఈ విషయంలో ఎస్‌పీడీ ఫ్లై ఓవర్ ఆర్కిటెక్ట్ భీమేష్‌తో పాటు మరికొంత ప్రొఫెసర్ల సలహాలు, సూచనలు తీసుకుంటా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆశీల్‌మెట్ట నుంచి సిరిపురం వరకు, అలాగే వీఐపీ రోడ్డులోను మున్ముందు మరింత ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశమున్నందున అందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా సంపత్‌వినాయ టెంపుల్ నుంచి సిరిపురం మధ్యలో బహుళ అంతస్తులలో షాపింగ్‌లు కారణంగా రద్దీ ఎక్కువగా ఉంటోందని, ఆయా యజమానులు ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆర్కిటెక్ట్ భీమేష్ మాట్లాడుతూ ఒక కిలోమీటర్‌కు ఒక జంక్షన్ ఉండేలా చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గడంతో పాటు కాలుష్య నియంత్రణకు దోహదంగా ఉంటుందని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

జిల్లా స్థాయి ఉత్తమ గురువుల అవార్డులకు దరఖాస్తులు

ఆరిలోవ : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ గురువుల అవార్డులు కోసం దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఈ నెల 28వ తేదీ వరకు స్వీకరిస్తారన్నారు. దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. దీని కోసం రెండు కేటగిరీలలో నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. కేటగిరీ–1లో స్టేట్ గవర్నమెంట్, జిల్లా పరిషత్, మున్సిపాల్, ఐటీడీఏ, ఎయిడెడ్, ఏపీఆర్ఐఈఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎస్ మేనేజ్‌మెంట్ హైస్కూల్, యూపీ స్కూళ్లలో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, టీజీటీలు, పీజీటీలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. కేటగిరీ–2లో స్టేట్ గవర్నమెంట్, జిల్లా పరిషత్, మున్సిపాల్, ఐటీడీఏ, ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న సెకెండరీగ్రేడ్, వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రేడ్–2 పండిట్లు, క్రాఫ్ట్, డ్రాయింగ్, మ్యూజిక్ ఉపాధ్యాయులు దరఖాస్తులు చేయాలన్నారు. దీని కోసం పదేళ్ల కనీస సర్వీస్ ఉండాలని, గతంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు కోసం దరఖాస్తు చేసుకొన్నవారు కూడా అర్హులన్నారు. క్రిమినల్ చర్యలకు గురైనవారు, క్రమశిక్షణా చర్యలకు గురైనవారు అనర్హులన్నారు.

అప్పల బాధతో కుటుంబం ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ భార్యాభర్తలు మృతి
- కుమార్తె పరిస్థితి విషమం
- పెందుర్తి మండలం గొరపల్లిలో ఘటన



మృతులు సత్యనారాయణ, సూర్యకుమారి (ఫైల్)



చికిత్స పొందుతున్న నీలిమ (ఫైల్)

సింహాచలం : అప్పులు తీర్చలేక ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన విశాఖ జిల్లా పెందుర్తి మండలం గొరపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తల్లిదండ్రులు మృతి చెందగా, కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. గ్రామస్తుల కథనం ప్రకారం...గొరపల్లిలో కల్లూరు సత్యనారాయణ (57) కిరణా దుకాణం నడుపుతున్నాడు. అతనికి భార్య సూర్యకుమారి (48), కుమారుడు సంతోష్ (26), కుమార్తె నీలిమ (24) ఉన్నారు. కుమారుడు సంతోష్ ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్నాడు. కుమార్తె నీలిమ డిగ్రీ చదివి ఇంట్లోనే ఉంటోంది. సత్యనారాయణ, సంతోష్ ఇటీవల అప్పులు చేశారు. అప్పులు తీర్చమని ఫైనాన్స్ వాళ్లు సత్యనారాయణ ఇంటికి వచ్చి డిమాండ్ చేస్తున్నారు. దీంతో మనస్థాపానికి గురైన సత్యనారాయణ, సూర్యకుమారి, నీలిమ గురువారం అర్ధరాత్రి దాటాకా పురుగు మందు తాగారు. ఈ విషయాన్ని సూర్యకుమారి అదే గ్రామంలో ఉంటున్న బంధువుకి ఫోన్‌చేసి చెప్పింది. దాంతో సూర్యకుమారి బంధువు, గ్రామస్తులు సత్యనారాయణ ఇంటికి చేరుకున్నారు. ఆ సమయంలో సంతోష్ ఇంట్లో లేకపోవంతో అతనికి సమాచారం ఇచ్చారు. ఇంటికి చేరుకున్న సంతోష్, బంధువులు, స్థానికులు కలిసి వారిని కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సత్యనారాయణ, మధ్యాహ్నం సూర్యకుమారి మృతి చెందారు. నీలిమ పరిస్థితి విషమంగా ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు. పెందుర్తి సీఐ ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సుమారు రూ.25 లక్షల వరకు అప్పులున్నట్టు తెలిసింది.

లోకేష్‌పై ఫిర్యాదు



పెందుర్తి సీఐ శ్రీనివాసరావుకి ఫిర్యాదు కాపీని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాచలం : టీడీపీ నేత నారా లోకేష్‌పై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పెందుర్తి సీఐ శ్రీనివాసరావుకి ఫిర్యాదుకాపీ అందజేశారు. గన్నవరంలో రెండు రోజుల క్రితం జరిగిన యువగళం పాదయాత్రలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే విధంగా లోకేష్ మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎవరికైతే ఎక్కువ క్రిమినల్ కేసులు ఉంటాయో అలాంటి వారికే టీడీపీలో నామినేటెడ్ పదవులు ఇస్తానని బహిరంగంగా లోకేష్ ప్రకటించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన లోకేష్‌పైన, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ పెందుర్తి మండల అధ్యక్షుడు నక్క కనకరాజు, పార్టీ అనకాపల్లి సోషల్ మీడియా కన్వీనర్ కోరాడ చందు యాదవ్, పెందుర్తి కన్వీనర్ ఐడి.బాబు, వైస్ ఎంపీపీ చిరికి దేముడు, గొరపల్లి సర్పంచ్ శ్రీను, పార్టీ నాయకుడు రఘు తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

నేటి దేహదారుఢ్య పరీక్ష వాయిదా

ఆరిలోవ : విశాఖ రేంజ్‌లో స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ సబ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాలు కోసం అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కైలాసగిరి సమీపంలో ఆర్మడు రిజర్వుడ్ పోలీస్ మైదానానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి అభ్యర్థులు ఉదయం 5 గంటలకే చేరుకొన్నారు. ఏఆర్ పోలీస్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్దే క్యూలో వేచి ఉన్నారు. ద్వారం వద్ద అధికారులు అభ్యర్థుల హాల్ టిక్కెట్లు పరిశీలించి లోపలకు బ్యాచ్‌లువారిగా పంపించారు. మొదటి రోజు 600 మందికి కాల్ లెటర్లు పంపగా అందరూ హాజరైనట్లు రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు.



ఏఆర్ పోలీస్ కార్యాలయం గేట్టు వద్ద క్యూలో ఉన్న ఎస్.ఐ అభ్యర్థులు

వర్షాల నేపథ్యంలో.. : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శనివారం జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షను సెప్టెంబర్ 23వ తేదీ నాటికి వాయిదా వేశారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

'భెల్' ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

అక్కిరెడ్డిపాలెం: భెల్(హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ ఎన్నికల నామినేషన్ల పర్వం శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 31న ఈ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయీస్ యూని యన్(ఇంటక్ అనుబంధం) ప్రోగ్రెసివ్ ఫ్రంట్ అభ్యర్థులు జి.టి.పి.ప్రకాష్(అధ్యక్షుడు), ఉరుకూటి బాబూరావు(ప్రధాన కార్యదర్శి) తమ నామినేషన్లను రీజనల్ లేబర్ కమిషనర్ జగన్నాథ్ మహంతికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్.నవీన్ కుమార్, వై.కృష్ణారావు, వి.ఆనందరావు, పి.ఆనంద్ కుమార్, ఎస్.జగన్నాథరావు, ఆర్.అప్పారావు పాల్గొన్నారు. అలాగే యునైటెడ్ ఫ్రంట్ నుంచి అధ్యక్షుడిగా బొండా బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా శుభాకర్ సాహూ తమ నామినేషన్ పత్రాలను లేబర్ కమిషనర్‌కు సమర్పించారు.



నామినేషన్లు దాఖలు చేస్తున్న ప్రోగ్రెసివ్ ఫ్రంట్ అభ్యర్థులు

గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం: విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపవతి ఓ ప్రకటనలో కోరారు. జేఎల్-ఇంగ్లిష్, టీజీటీ-ఫిజికల్ సైన్స్, జేఎల్-జువాలజీ, టీజీటీ-బయలాజికల్ సైన్స్, పీజీటీ-సోషల్ సబ్జెక్టు పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ ఒరిజినల్, నకలు, ధ్రువీకరణపత్రాలతో 28వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు కొమ్మాదిలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించే డెమోకి హాజరు కావాలని సూచించారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ కలిగి ఉండాలని, టెట్ అర్హత సాధించిన వారికి ప్రాధాన్యమిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 0891-2799641లో సంప్రదించవచ్చు.

వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీల భర్తీకి వినతి



ఆరోగ్య శాఖ డైరెక్టర్ రామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్జీవో సంఘ ప్రతినిధులు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు పూర్తి చేయాలని ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, సిటీ అధ్యక్షుడు నారాయణరావు కోరారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డిని వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. వైద్య ఆరోగ్యశాఖలో రాష్ట్ర వ్యాప్తంగా పరిపాలనాధికారుల పోస్టులు 10 వరకు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి రవిశంకర్, కోశాధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టాస్క్ పేరిట టోకరా

- సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వల
- యూట్యూబ్ వీడియోలకు లైక్, సబ్‌స్క్రైబ్ చేస్తే కమిషన్ అంటూ ఎర
- హోటళ్లకు రివ్యూ రాస్తే డబ్బులు ఇస్తామంటూ నమ్మిస్తున్న మోసగాళ్లు
- 72 మంది నుంచి రూ.9.5 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు
- సీపీ త్రివిక్రమ్ వర్మ వెల్లడి

నిరుద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, గృహిణులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. పార్ట్‌టైం జాబ్స్, టాస్క్‌ల పేరుతో విద్యావంతులకే వల విసిరి.. రూ.కోట్లు కాజేస్తున్నారని చెప్పారు. తాజాగా మరో ఇద్దరిని సుమారు రూ.30 లక్షలకు నిలువుదోపిడీ చేసినట్లు సీపీ వెల్లడించారు.



సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ, పోలీస్ ఉన్నతాధికారులు

దొండపర్తి: అడవివరం ప్రాంతానికి చెందిన ఓ మహిళ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆమె వాట్సాప్‌కు పార్ట్‌టైం జాబ్ పేరుతో ఓ మెసేజ్ వచ్చింది. హోటల్ రివ్యూ, రేటింగ్స్ ఇస్తూ డబ్బులు సంపాదించవచ్చన్నది ఆ మెసేజ్ సారాంశం. దానికి ఆమె అంగీకరించి ఓ రోజు రివ్యూలు రాయగా ఒక్కో దానికి రూ.150 చొప్పున ఆమె అకౌంట్‌లో డబ్బులు జమయ్యాయి. తర్వాత రివ్యూలు బాగున్నాయని, ఆమెకు కొన్ని టాస్క్‌లు ఇచ్చి రూ.2 వేలు జమ చేయమని చెప్పారు. టాస్క్‌లు పూర్తి చేస్తే రూ.2800 వస్తాయని నమ్మించారు. ఆమె డబ్బులు చెల్లించి టాస్క్ పూర్తి చేయగా అకౌంట్‌లో రూ.2800 ఉన్నట్లు ఫేక్ అకౌంట్‌ను చూపించారు. మళ్లీ టాస్కుల కోసం అనేక దఫాలు డబ్బులు డిపాజిట్ చేయించుకున్నారు. చివరకు టాస్క్‌లకు ఇంకా డబ్బులు కట్టలేనని చెప్పడంతో డబ్బులు విత్‌డ్రా చేసుకోవాలంటే జీఎస్టీ, ఆదాయ పన్నులు కట్టాలంటూ రూ.22,74,027 కాజేశారు.

ఇలా నగరంలో ఒకరిద్దరు కాదు.. అధికారికంగా 72 మంది బాధితులు ఉన్నారు. ఈ ఏడాదిలో వీరి నుంచి సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.9,58,83,839 కొల్లగొట్టారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ వెల్లడించారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

మోసం చేస్తున్నారిలా..

నిరుద్యోగులు ఉద్యోగాల కోసం నౌకరీ.కామ్, షైన్.కామ్ వంటి వెబ్‌సైట్‌లో పెడుతున్న వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు సేకరిస్తున్నారు. వారిని టార్గెట్ చేస్తూ పార్ట్‌టైం జాబ్స్ పేరుతో మోసం చేస్తున్నారు. వాట్సాప్, టెలీగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటనలు, మెసేజ్‌ల రూపంలో ప్రజలకు వల విసురుతున్నారు. వీటిని నమ్మిన వారికి కమిషన్ ఆశ చూపిస్తూ టాస్క్ గేమ్స్ కింద వారిని రిక్రూట్ చేసుకునే విధంగా నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టిస్తున్నారు. ముందుగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, గూగుల్‌లో పార్ట్‌టైం జాబ్ పేరుతో ఓ లింక్‌ను డిస్‌ప్లే చేస్తున్నారు. దాన్ని క్లిక్ చేస్తే నేరుగా వాట్సాక్ ఖాతాకు కనెక్ట్ అవుతుంది. చిన్న టాస్క్‌లు పూర్తి చేస్తే మంచి ఆదాయం వస్తుందని నమ్మిస్తారు. నిజమని నమ్మి మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ అయితే టెలీగ్రామ్ లింక్‌ను పంపి అందులో జాయిన్ అవ్వాలని సూచిస్తారు. తర్వాత కొన్ని టాస్కులు, రీచార్జ్ అమౌంట్, వాటిపై వచ్చే కమిషన్ ఇలా ఒక లిస్ట్‌ను పంపిస్తారు. అది నిజమని నమ్మి రీచార్జ్ చేసుకుంటే ముందు రెండు, మూడు టాస్కులకు కమిషన్ వెంటనే అకౌంట్‌లోకి జమ చేస్తారు. ఆ తర్వాత మాత్రం రీచార్జ్ చేయించుకున్న అమౌంట్‌తో పాటు కమిషన్ కూడా ఫ్రీజ్ అయినట్లు చూపిస్తూ విత్‌డ్రా చేసుకోడానికి మళ్లీ మళ్లీ రీచార్జ్ చేసేలా చేస్తారు. అలాగే బాధితుడు తనకు తానుగా తెలుసుకునే వరకు డబ్బులు గుంజుతూనే ఉంటారు.

మోసపోయారిలా..

నగరానికి చెందిన ఓ బాధితురాలిని మొదటగా యూట్యూబ్‌లో వీడియో లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేస్తే డబ్బులు వస్తాయని నమ్మించారు. అలా చేసినందుకు ప్రతి లైక్‌కి రూ.100ను ఆమె అకౌంట్‌లో జమ చేశారు. అలా మొదటి రోజు బాధితురాలికి సుమారుగా నాలుగు వీడియోలను లైక్ చేయమని చెప్పి రూ.400 వేశారు. 5వ టాస్క్ కోసం టెలీగ్రాం యాప్‌కు రీడైరెక్ట్ చేశారు. గైడెన్స్ కోసం ఓ ట్యూటర్‌తో పాటు గ్రూప్‌లో నలుగురితో కలిసి టాస్క్ చేయాలని చెప్పారు. మొదటి టాస్క్ రూ.54 వేలతో కొనాలని, అందుకు 30 శాతం కమిషన్‌తో రూ.70,200 వస్తుందని నమ్మించారు. బాధితురాలు అది నమ్మి రూ.54 వేలతో కొని వారు చూపించిన వెల్ఫేర్ టాస్క్ బటన్ కొట్టగా, కమిషన్‌తో కలిపి రూ.70,200 ఇస్తున్నట్లు చూపించారు. డబ్బులు విత్‌డ్రా చేయాలంటే మరి కొన్ని టాస్క్‌లు కచ్చితంగా పూర్తి చేయాలని చెప్పారు. కొంతసేపటి తర్వాత తాను ఇక కొనలేనని చెప్పినప్పటికీ మిగిలిన గ్రూప్ సభ్యులతో ఎమోషనల్‌గా బ్లాక్‌మెయిల్ చేయించారు. తను టాస్క్ పూర్తి చేయకపోతే తమకు డబ్బులు రావని, తన పిల్లలతో ఆత్మహత్య చేసుకుంటానని ఆమెను గ్రూప్ సభ్యురాలతో బెదిరించారు. ఇలా వివిధ కారణాలతో మొత్తంగా రూ.8.82 లక్షలు కొల్లగొట్టారు. డబ్బులు విత్‌డ్రా చేసుకోవాలనుకుంటే ఇంకొంత మొత్తం చెల్లించమనగా ఆమె మోసపోయినట్లు గ్రహించారు. అలాగే రూ.18 వేలకు ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న మరో బాధితురాలిని కూడా ఇదే తరహాలో మోసం చేసి రూ.7.5లక్షలు కాజేశారు.

బాధితులే నిందితులు..

కంచరపాలెం ప్రాంతానికి చెందిన గున్ను హేమంత్ 22 ఇన్‌స్టంట్ లోన్‌యాప్స్ ద్వారా చిన్న మొత్తంలో లోన్ తీసుకొని వాటిని తిరిగి చెల్లించాడు. అయినప్పటికీ ఇంకా డబ్బులు కట్టాలంటూ లేని పక్షంలో ఫొటోలను మార్ఫింగ్ చేసి అందరికీ పంపిస్తామని బెదిరించారు. అలా సైబర్ నేరగాళ్లు బాధితుడి ఫొటోలను అతని ఫ్రెండ్స్, బంధువులకు పంపించారు. దీంతో హేమంత్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీపీ సైబర్ క్రైంకు అప్పగించారు. దీంతో సైబర్‌క్రైం పోలీసులు హేమంత్ మొబైల్‌ను సేకరించి అందులో వివిధ నంబర్ల నుంచి, వాట్సాప్ ద్వారా బెదిరింపు మెసేజ్‌లను పరిశీలించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్ ఆధారంగా, లోన్ తీసుకున్న డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో తెలుసుకున్నారు. సంబంధిత బ్యాంక్ అకౌంట్ అనంతపురానికి చెందిన సుబ్బరామిరెడ్డిదిగా గుర్తించారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీప్రసాద్, అతని బృందం అనంతపురం వెళ్లి సుబ్బరామిరెడ్డిని పట్టుకున్నారు. మరికొన్ని అకౌంట్స్ ఒడిశాకు చెందిన దిలీప్ కుమార్ పాత్రాకు చెందినది కావడంతో.. అతన్ని కూడా అదుపులోకి తీసుకుని విచారించారు.

ఒక్కొక్కరి పేరు మీద ఎన్నో ఖాతాలు

బ్యాంక్ ఉద్యోగిగా పని చేసిన సుబ్బరామిరెడ్డికి కూడా సోషల్ మీడియాలో వచ్చిన మేసేజ్‌కు స్పందించి సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయాడు. దాని నుంచి బయటపడడమే కాకుండా బ్యాంకు ఖాతాలు తెరిచి ఇస్తే.. అకౌంట్‌లో జరిగే లావాదేవీలకు ఒక శాతం కమిషన్ ఇస్తామని నేరగాళ్లు నమ్మించారు. దీంతో సుబ్బరామిరెడ్డి వివిధ ప్రాంతాలకు చెందిన 15 బ్యాంకుల నుంచి ఖాతాలు తీసుకుని ఆ వివరాలను వారికి అందజేశాడు. దీంతో సైబర్ నేరగాళ్లు వాటి ద్వారా రూ.18 కోట్ల లావాదేవీలు సాగించారు. దీనికి గానూ సుబ్బరామిరెడ్డికి ఏడాదిలో రూ.16లక్షలు, దిలీప్‌కుమార్‌కు రూ.80వేల వరకు కమిషన్ రూపంలో ఇచ్చినట్లు వారు పోలీసుల విచారణలో అంగీకరించారు.

బిట్‌కాయిన్‌లోకి మళ్లింపు

తాము ఎక్స్ హెల్పర్ అనే యాప్‌ను ఉపయోగించి అందులో చాలా అకౌంట్లను యాడ్ చేసుకుని వాటి ద్వారా డబ్బులు వేయడం, కలెక్ట్ చేసుకుంటున్నట్లు నిందితులు తెలిపారు. వీరితో పాటు ఉత్తరప్రదేశ్ చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, ఢిల్లీ ప్రాంతాలకు చెందిన వారు కూడా ఉన్నట్లు గుర్తించారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న ప్రధాన నిందితుడి కోసం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు సీపీ త్రివిక్రమ్ వర్మ తెలిపారు. ప్రజలను మోసం చేసి కాజేసిన డబ్బులను నేరగాళ్లు బిట్‌కాయిన్‌లోకి మళ్లిస్తున్నట్లు చెప్పారు. అనంతరం లోన్ యాప్‌లు, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కలిగించే పోస్టర్లను సీపీ, ఇతర అధికారులు ఆవిష్కరించారు.

'గంగవరం' కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి

- పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్



మంత్రి అమర్‌నాథ్‌తో గంగవరం పోర్టు కార్మిక సంఘాల ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం/పెదగంట్యాడ: గంగవరం పోర్టు కార్మికులు 54 రోజులుగా చేస్తున్న ఆందోళనకు ముగింపు పలకాలన్న ఉద్దేశంతో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో మిందిలోని ఆయన నివాసంలో శుక్రవారం కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు చర్చలు జరిపారు. ఇప్పటికే కార్మికుల డిమాండ్లు కొన్నింటిని పోర్టు యాజమాన్యం అంగీకరించింది. మరికొన్ని ప్రధాన డిమాండ్ల సాధన కోసం కార్మికులు మంత్రి అమర్‌నాథ్‌ను కలిశారు. ఇంక్రిమెంట్ పెంపుదల విషయంలో కార్మికులు, యాజమాన్యానికి మధ్య స్పష్టమైన ఒప్పందం కుదరాల్సి ఉంది. పోర్టును షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద కాకుండా ఫ్యాక్టరీ యాక్ట్ కింద తీసుకురావాలని కార్మికుల డిమాండ్ చేస్తున్నారు. వీటితో పాటు మరికొన్ని డిమాండ్లను మంత్రి అమర్‌నాథ్ ముందుంచారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ కార్మికులు నష్టపోకుండా డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. శనివారం మరోసారి కార్మికులు, నాయకులతో సమావేశమై సమస్యలను ఓ కొలిక్కి తీసుకొస్తామన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, పులి వెంకటరమణారెడ్డి, శ్రీనివాసరావు, కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో శబరిమల అయ్యప్ప సమాచార కేంద్రం

- నేడు ప్రారంభం

సీతంపేట: అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ), శ్రీ పూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకరమఠంలో శబరిమల అయ్యప్ప సమాచార కేంద్రం ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం 5 గంటలకు ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు చైర్మన్ కె.అనంతగోపన్, సభ్యులు ఎస్.ఎస్.జీవన్, జి.సుందరేశన్, ఏబీఏపీ జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్ పాల్గొంటారని పేర్కొన్నారు.

లయన్స్‌ను వేటాడిన టైటాన్స్

- నేడు రాయలసీమ కింగ్స్‌తో ఢీ
- గెలిచిన జట్టు ఫైనల్‌లోకి..



గోదావరి బ్యాటర్ల విజయవిహారం

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ సీజన్-2 ఎలిమినేటర్ మ్యాచ్‌లో లయన్స్‌ను టైటాన్స్ వేటాడేశాయి. లీగ్ పాయింట్ల పట్టికలో రన్‌రేట్‌లో వెనుకబడ్డా... హెడ్‌ఆన్స్‌లో విజయంతో ఎలిమినేటర్ మ్యాచ్‌కు అర్హత సాధించిన గోదావరి టైటాన్స్ విజయమే లక్ష్యంగా రెచ్చిపోయింది. ఉత్తరాంధ్ర లయన్స్‌పై ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించి క్వాలిఫైయర్స్ మ్యాచ్‌కు అర్హత సాధించింది.

మిడిలార్డర్ తడబాటు

టాస్ గెలిచిన గోదావరి టైటాన్స్.. ఉత్తరాంధ్ర లయన్స్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్ గుల్ఫామ్(49) విజయ్ బౌలింగ్‌లో సందీప్‌కు క్యాచ్ ఇచ్చి ఒక్క పరుగు తేడాతో అర్ధసెంచరీని కోల్పోయాడు. మరో ఓపెనర్ కెప్టెన్ భరత్(37) విజయ్ బౌలింగ్‌లోనే మాధవ్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. వీరి జోడి తొలి వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. అయితే శ్యామ్(2), రాహుల్(0), తపస్వి(2) విజయ్(8)తో వెనువెంటనే ఔట్ అవ్వడంతో 11 ఓవర్లకు 108 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో శ్రీనివాస్(12), తేజస్వి(12), రఫీ(17) ఇన్నింగ్స్ ను కాస్త సరిదిద్దే ప్రయత్నం చేసినా మరో బంతి మిగిలి ఉండగానే 153 పరుగులకు ఆలౌటైంది. శశికాంత్, సమన్విత్ మూడేసి వికెట్లు తీయగా విజయ్ రెండు, కమిల్ ఓ వికెట్ పడగొట్టాడు.

జ్ఞానేశ్వర్ కెప్టెన్ ఇన్నింగ్స్

ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్ ఓపెనర్ మునీష్ డకౌట్ గానే అజయ్‌కుమార్ బౌలింగ్‌లో వాసుకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఓపెనర్ కెప్టెన్ జ్ఞానేశ్వర్‌కు హేమంత్ రెడ్డి తోడై స్కోర్‌ను పరుగులెత్తించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు వంద పరుగులను జోడించారు. 124 పరుగుల వద్ద హేమంత్ 71(ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లు) పరుగులతో తపస్వి బౌలింగ్‌లో విజయ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అతని స్థానంలో వచ్చిన ధీరజ్ రెండు ఫోర్లు, రెండు సిక్సర్లు బాది 25 పరుగులకు సరిగ్గా 153 పరుగుల వద్ద ఔటయ్యాడు. తపస్వి ఓవర్‌లో చివరి బంతిని సందీప్ ఎదుర్కొని లాంగాన్ మీదుగా సిక్సర్‌గా తరలించాడు. దీంతో 18 ఓవర్లలో మూడు వికెట్లకు 159 పరుగులు చేసి టైటాన్స్ గెలిచింది. కెప్టెన్ జ్ఞానేశ్వర్ రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 53 సాధించి అజేయంగా నిలిచాడు. తపస్వి రెండు, అజయ్‌కుమార్ ఓ వికెట్ తీశారు.

వర్షంతో ఆట రద్దు.. ఫైనల్స్‌కు కోస్టల్ రైడర్స్

సాయంత్రం జరిగిన క్వాలిఫైయింగ్ తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన రాయలసీమ కింగ్స్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో కోస్టల్ రైడర్స్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ధరణి(41), ప్రణీత్(15) వెనుదిరగ్గా రషీద్ 27, హర్షవర్ధన్ 11 పరుగులతో ఉండగా 10.2 ఓవర్ల వద్ద వర్షం కారణంగా ఆట నిలిచిపోయింది. అప్పటికి రైడర్స్ స్కోర్ రెండు వికెట్లకు 103 పరుగులు. వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేసి లీగ్‌లో ఆధిక్యంలో ఉన్న రైడర్స్ ఫైనల్స్‌కు అర్హత సాధించినట్లు నిర్వాహకులు ప్రకటించారు. శనివారం రాయలసీమ కింగ్స్, గోదావరి టైటాన్స్ పోటీపడతాయి. గెలిచిన జట్టు రైడర్స్‌తో తుదిపోరుకు సిద్ధమవుతుంది.

నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ జగదీశ్వరరావు డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ అశోక్‌కుమార్

సీతంపేట: ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.విశ్వమిత్ర, ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జి. బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ ఈ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వామిత్ర మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు 15 రోజులపాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నేత్రదానంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నేత్రదాన ఆవశ్యకతపై పాఠశాలలు, నర్సింగ్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ముగింపు రోజు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. రోటరీ క్లబ్ వాల్తేర్ అధ్యక్షుడు పి.శామ్యూల్ బెన్ విక్టర్, ఉపాధ్యక్షుడు బెట్సీ విలియమ్స్, పూర్వ అధ్యక్షులు ఉషారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ప్రాంతీయ నేత్రవైద్యశాల వైద్యులు పాల్గొన్నారు.

'సాల్వెంట్ రికవరీ ప్లాంట్లలో అధిక ప్రమాదాలు'



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న లారస్ ల్యాబ్ సీఈవో సత్యనారాయణ

ఉక్కునగరం: ఇటీవల కాలంలో సాల్వెంట్ రికవరీ ప్లాంట్లలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు ఆయా యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫ్యాక్టరీ డైరెక్టర్ డి. చంద్రశేఖర్ వర్మ సూచించారు. సొసైటీ ఫర్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ(ఎస్‌వోహెచ్ఎస్) ఆధ్వర్యంలో ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో శుక్రవారం 'సేఫ్టీ మేనేజ్‌మెంట్ ఇన్ సాల్వెంట్ రికవరీ ప్లాంట్' అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెమికల్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లారస్ ల్యాబ్ సీఈవో సి. సత్యనారాయణ తన 20 ఏళ్ల అనుభవంలో సాల్వెంట్ రికవరీ సేఫ్టీకి సంబంధించి అనుభవాలను పంచుకున్నారు. స్టీల్‌ప్లాంట్ వర్క్స్ సీజీఎం బి.కె.మొహంతి మాట్లాడుతూ ప్రాసెస్ ఇండస్ట్రీస్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్యాక్టరీ డిపార్ట్‌మెంట్ భాగస్వామ్యం కీలకమన్నారు. జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకరరెడ్డి మాట్లాడుతూ విశాఖ రీజియన్‌లో సుమారు 10 సాల్వెంట్ రికవరీ ప్లాంట్‌లు ఉండగా ఇందులో మూడు ఫ్యాక్టరీల్లో మేజర్ ప్రమాదాలు జరిగాయన్నారు. ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతి డాక్టర్ డి.రామ్‌ప్రసాద్, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



కళావతి(ఫైల్)

టీచర్స్ రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అనుమానాస్పద మృతి కలకలం రేపింది. వివరాలివీ.. పోలమాంబ ఆలయ సమీపంలోని ఎల్ఐసీ క్వార్టర్స్‌లో శ్రీనివాస్, కళావతి (35) దంపతులు తమ ఇద్దరి పిల్లలతో నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి అస్వస్థతకు గురైన కళావతిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికి ఆమె మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. అయితే కళావతిని ఆమె భర్తే హత్య చేశాడని బంధువులు ఆరోపించారు. శ్రీనివాస్ మాత్రం తన భార్య అనారోగ్యంతోనే మృతి చెంది ఉంటుందని చెబుతున్నాడు. ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పదంగా మృతిగా కేసు నమోదు చేశారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

నీట్ 2023 ర్యాంకర్లకు గీతం ఫీజు రాయితీ

కొమ్మాది: నీట్-2023లో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన వారికి గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫీజు రాయితీ ప్రకటించింది. ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ప్రో.వైస్ చాన్సలర్ బి.గీతాంజలి ఈ వివరాలు ప్రకటించారు. నీట్-2023లో జాతీయ స్థాయిలో దాదాపు 11.45 లక్షల మందికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జీమ్‌సర్‌లో చేరే ప్రతిభావంతులకు రాయితీ రూపంలో స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. లక్షా యాభైవేల లోపు ర్యాంకు సాధించిన వారికి 50 శాతం ఫీజు రాయితీ, 3 లక్షల లోపు వారికి 25 శాతం, 4 లక్షల 50 వేలలోపు వారికి 15 శాతం, 6 లక్షల లోపు ర్యాంకు సాధించిన వారికి 10 శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు. డీన్ ఎస్పీ రావు, ప్రిన్సిపాల్ డా.జ్యోతి పద్మజ తదితరులు పాల్గొన్నారు.